నమస్తే తెలంగాణ
జనగామ
5 | వరంగల్, మంగళవారం 8 ఏప్రిల్ 2025 | JANAGAON

సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదనాచారి, పక్కన మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీశ్‌కుమార్, నన్నపునేని నరేందర్

సభపై అపోహలు వద్దు

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పోలీసుల అనుమతి వస్తుంది. అనుమతి రాలేదనే అపోహల్లో ఎలాంటి నిజం లేదు. అనుమతి ఇచ్చేందుకు పోలీసులు కూడా సిద్ధంగా ఉన్నారు. సభ మీద పోలీసుల ఆంక్షలు లేవు. 30 యాక్టుతో ఎలాంటి ఇబ్బంది తలెత్తదు. సభకు 50 వేల వరకు వాహనాలు వస్తాయనే అంచనాతో వరంగల్-సిద్దిపేట-కరీంనగర్ రూట్లలో భారీగా పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేస్తున్నాం. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. వేసవి దృష్ట్యా 10 లక్షల వాటర్ బాటిళ్లు, మజ్జిగ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచుతున్నాం. ఇటీవల జరిగిన మహా కుంభమేళాకు వచ్చినట్లు ప్రజలు లక్షలాదిగా ఈ సభకు తరలివస్తారు.

– వొడితెల సతీశ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే

అబద్ధాలు.. వైఫల్యాలు.. మోసాలు

ఇదే కాంగ్రెస్ ప్రభుత్వ పాలన

- 16 నెలల్లోనే రూ. 1.60 లక్షల కోట్ల అప్పు
- తెలంగాణ పాలిట భూత, పిశాచం కాంగ్రెస్
- కేసీఆర్ సంపద సృష్టిస్తే.. కాంగ్రెస్ ఢిల్లీకి పంపుతున్నది
- ఎల్కతుర్తి రజతోత్సవ మహాసభ చరిత్రాత్మకం
- ప్రభుత్వం మెడలు వంచేందుకే సభ నిర్వహణ
- శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ
- రజతోత్సవ మహాసభ ప్రాంగణ పనుల పరిశీలన
- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు వొడితెల, నన్నపునేని

ఎల్కతుర్తి, ఏప్రిల్ 7: అబద్ధాలు, వైఫల్యాలు, మోసాలు.. ఇదే 16 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలన అని శాసనమండలి ప్రతిపక్షనేత, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి ఎద్దేవా చేశారు. ఆది నుంచి ఇప్పటి వరకు తెలంగాణ ప్రజల పాలిట ఆ పార్టీ భూత, పిశాచంలా తయారైందని ఆయన మండిపడ్డారు. ఈ నెల 27న ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రజతోత్సవ మహాసభ ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీశ్‌కుమార్, నన్నపునేని నరేందర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మధుసూదనాచారి మాట్లాడుతూ ఈ మహాసభ చరిత్రాత్మకమన్నారు. హామీల అమలు కోసం ప్రభుత్వం మెడలు వంచేందుకే సభ నిర్వహిస్తున్నామన్నారు. గడిచిన 25 ఏండ్లల్లో తెలంగాణ ఆత్మగౌరవం, ప్రయోజనాల విషయంలో రాజీ లేని పోరాటం చేసిన ఏకైక పార్టీ బీఆర్ఎస్, అధినేత కేసీఆర్ అన్నారు. కాంగ్రెస్ అంటే తెలంగాణకు ద్రోహం చేసేందుకు పుట్టిన పార్టీ అని ఎద్దేవా చేశారు. దేశానికి 1947లో స్వాతంత్ర్యం వచ్చిందని, దీని అర్థం, పరమార్థం అందరూ ఆత్మగౌరవంతో బతకడమేనన్నారు. అయితే తెలంగాణ విషయంలో మాత్రం అది కొనసాగలేదని, 1956లో ఆంధ్రాతో కలిపే సమయంలో నీళ్లు, నిధులు, ఆత్మగౌరవం కోల్పోతామని చెప్పినా వినలేదన్నారు. మన హక్కుల కోసం పోరాడే సమయంలో ఎన్నో ఆత్మహత్యలు, అవమానాలు పడినా, వనరులు దోపిడీకి గురవుతున్నా కాంగ్రెస్ పార్టీ చలించలేదని ఆరోపించారు. తెలంగాణ ప్రజల బతుకులు, వనరుల దోపిడీలు చూసి చలించిన కేసీఆర్ 2001లో బీఆర్ఎస్‌ను స్థాపించి, అనేక పోరాటాల తర్వాత రాష్ట్రాన్ని సాధించుకున్నామని చెప్పారు. రాష్ట్రం వస్తే నీళ్లు, నిధులు, కరెంటు రాదని, పాలన చేతకాదని అవహేళన చేసిన పార్టీ కాంగ్రెస్ అన్నారు. అటువంటి సమయంలో పాలనా పగ్గాలు చేపట్టిన కేసీఆర్ రెండేళ్లలోనే దేశం మొత్తం రాష్ట్రంవైపు చూసేలా చేశారని పేర్కొన్నారు. ఇటీవల శాసనమండలిలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను రాష్ట్రంలో 90 లక్షల పేద మహిళలకు రూ. 2500 చొప్పున ఇవ్వలేదని, ప్రస్తుతం ప్రతి మహిళకు రూ.40 వేలు ఈ ప్రభుత్వం బాకీ ఉన్నదని ప్రశ్నించినట్లు గుర్తు చేశారు. వందేళ్ల పరిపాలన అనుభవం ఉన్న పార్టీ తమదని చెప్పిన కాంగ్రెస్ ఇప్పుడు అప్పుఅప్పు అంటూ చేతులు చాస్తున్నదని విమర్శించారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో రూ.4.17 లక్షల కోట్ల అప్పు చేస్తే, కాంగ్రెస్ కేవలం 16 నెలల్లోనే కోటి 60 లక్షల అప్పు చేసిందన్నారు. కేసీఆర్ చేసిన ప్రతి అప్పు సంపద సృష్టించడానికే ఖర్చు చేశారని, కరెంటు సమస్య పరిష్కారం, తాగునీరు, కాళేశ్వరం ప్రాజెక్టు, విద్యాలయాలు, మెడికల్ కాలేజీలు, జిల్లాల ఏర్పాటు, యాదాద్రి, సెక్రటేరియేట్, రోడ్లు, ఇలా చెప్పుకుంటే పోతే వందలాది అభివృద్ధి పనులు చేశారన్నారు. కానీ కాంగ్రెస్ తెచ్చిన అప్పులు పర్సంటేజీలు, ఢిల్లీ పంపకాలకేనని మండిపడ్డారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎక్కడ చూసినా 6 గ్యారెంటీల అమలు లేదని ప్రజలు గగ్గోలు పెడుతున్నారన్నారు. హైడ్రా విధ్వంసం, మొన్న లగచర్ల, నిన్న హెచ్‌సీయూ లాంటి పాలనా వైఫల్యాలు కనపడుతున్నాయన్నారు. కేసీఆర్ ఏదైనా పథకం మొదలుపెడితే మేథోమథనం చేసి అమలు చేసేవారన్నారు. ప్రస్తుతం తెలంగాణ అధఃపాతాళంలోకి నెట్టబడుతున్నదని, నాటి ఉద్యమ వాడీ వేడి కాంగ్రెస్ ప్రభుత్వానికి తాకేలా చూడాలన్నారు. ఇప్పటికే 16 నెలలు ముగిశాయని, రానున్న 12 నెలలకు కూడా బడ్జెట్ ఆమోదం పొందిందన్నారు. కాంగ్రెస్‌కు ప్రజలిచ్చిన సమయం 60 నెలలని, ఇందులో 28 నెలలు పోను మిగిలింది 32 మాసాలు మాత్రమేనన్నారు. 28 నెలల కాలానికి వారిచ్చిన హామీలకు కేటాయింపులు చూస్తే 40-50 శాతం కూడా లేవన్నారు. దీనిని బట్టి చూస్తే తెలంగాణకు ద్రోహం చేయాలనేదే కాంగ్రెస్ ఉద్దేశమని మండిపడ్డారు. ఈ విషయాలన్ని ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత రాష్ట్ర సాధకుడిగా, ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్‌కు ఉండడంతోనే బ్రహ్మాండమైన బహిరంగ పెట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. తెలంగాణ అంటే అభివృద్ధి, దేశానికి దిక్సూచి అని, ఆ స్థితిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. అందువల్ల రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజలు లక్షలాదిగా తరలివచ్చి చైత్యాన్ని చూపాలని సిరికొండ పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, వరంగల్ మార్కెట్ మాజీ చైర్మన్ చింతం సదానందం, ప్రొఫెసర్ భాస్కర్, శోభన్‌బాబు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పిట్టల మహేందర్, సొసైటీ చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్, మాజీ ఎంపీపీ మేకల స్వప్న, నాయకులు ఎల్తూరి స్వామి, తంగెడ మహేందర్, కడారి రాజు, గొల్లె మహేందర్, తంగెడ నగేశ్, దేవేందర్‌రావు, హింగె శివాజీ, అల్లకొండ రాజు, మహిపాల్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, వినయ్, సతీశ్, జడ్సన్, చిట్టిగౌడ్, మదార్ పాల్గొన్నారు.

మంగపేట : మల్లూరు శివారులో ధాన్యంపై పడిన వడగండ్లు

మంగపేట : నర్సింహసాగర్‌లో కురిసిన వడగండ్లు, (ఇన్‌సెట్) గోవిందరావుపేటలో..

వడగండ్ల బీభత్సం

- ములుగు, మానుకోట జిల్లాల్లో తీవ్ర ప్రభావం
- ఈదురుగాలులకు నేలవాలిన మక్కజొన్న, వరి
- దెబ్బ తిన్న రేకుల ఇండ్లు, కూలిన చెట్లు
- నిలిచిన విద్యుత్ సరఫరా

మహబూబాబాద్/ములుగు, ఏప్రిల్ 7(నమస్తే తెలంగాణ) : ములుగు జిల్లాలో వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. సోమవారం సాయంత్రం ఉమ్మడి జిల్లాలోని పలుచోట్ల ఈదురుగాలులు ఉధృతంగా వీయగా ములుగు జిల్లా వ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురవగా గోవిందరావుపేట, మంగపేట మండలాల్లో తీవ్ర ప్రభావం చూపింది. మంగపేట మండలంలోని నర్సింహసాగర్, మల్లూరు గ్రామాల శివార్లలో వెయ్యి ఎకరాల్లో కోత దశకు వచ్చిన మేల్, ఫిమేల్ రకం వరికి తీవ్ర నష్టం వాటిల్లింది. వడగండ్ల ధాటికి గింజలన్నీ నేల పాలయ్యాయి. మిగతా చోట్ల సాధారణ వరి, మక్కజొన్న చేలు నేలవాలాయి. కల్లాల్లో ఆరబోసుకున్న మిర్చి కూడా తడిసి ముద్దయి రంగు మారిపోతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. గాలి దూమారంతో మిర్చిపై వరదాలు కప్పేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ములుగు జిల్లాకేంద్రంలో గంటన్నర పాటు ఈదురుగాలులతో వర్షం పడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గోవిందరావుపేట, పస్రాలో గాలి వాన బీభత్సానికి ఇంటిపై ఉన్న రేకులు ఎగిరిపోయి వస్తు సామగ్రి చెల్లాచెదురైంది. ఇక మహబూబాబాద్ జిల్లాకేంద్రంతో పాటు కేసముద్రం, కురవిలోనూ వడగండ్ల వాన పడింది. గాలివానతో జిల్లాలో పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వరంగల్ జిల్లా ఖానాపురంలో ఈదురుగాలులకు పాకాల-చిలుకమ్మనగర్ మధ్య అటవీ ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా చెట్లు నేలవాలడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

కేసముద్రం: కురిసిన వడగండ్లను చూపుతున్న మహిళ

కేసముద్రం : గాలిదుమారానికి లేచిపోయిన రేకులు


గోవిందరావుపేట : పస్రాలో భారీ గాలులకు బైక్‌పై విరిగిపడిన రేకులు

గడపగడపనూ తట్టాలి

- మహాసభకు ప్రజలను ఆహ్వానించాలి
- భారీగా జనసమీకరణ చేపట్టాలి
- ప్రతి నాయకుడు, కార్యకర్త వచ్చేలా ఏర్పాట్లు చేయాలి
- రజతోత్సవ వేడుకలను విజయవంతం చేయాలి
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- జనగామ మున్సిపల్, రూరల్ మండల కార్యకర్తలకు దిశా నిర్దేశం

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ) : 'వరంగల్‌లోఈ నెల 27న అంబరాన్నంటేలా నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సంబురాలకు రావాలని గడపగడపను తట్టి ప్రజలను ఆహ్వానించాలి.. ఊరూవాడా జాతరలా తరలివచ్చేలా జన సమీకరణ చేయాలి.. వాహన సౌకర్యం కల్పిస్తున్నందున ప్రతి నాయకుడు, కార్యకర్త సహా ప్రజలు భారీగా హాజరయ్యేలా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలి' అని బీఆర్ఎస్ శ్రేణులకు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి దిశా నిర్దేశం చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో జనగామ మున్సిపాలిటీ, రూరల్ మండల ముఖ్య నాయకులతో ఆయన వేర్వేరుగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ సభను అడ్డుకునే శక్తి ఎవరికీ లేదని, గతంలో ఇక్కడ నిర్వహించిన సభ దేశంలోనే అత్యంత పెద్దదిగా గుర్తింపు తెచ్చుకుందన్నారు. ఇది ప్రజా జాగరణ బహిరంగ సభగా చరిత్ర సృష్టించబోతున్నదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో భారీ ఎత్తున ప్రజలు వరంగల్ సభకు స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రతి కార్యకర్త కథానాయకుడిగా మారి రాష్ట్రంలో సాధించిన ప్రగతి, చేసిన అభివృద్ధి, సంక్షేమంపై ప్రచారం చేయడంతో పాటు మహాసభ విజయవంతానికి కృషి చేయాలన్నారు.

ధాన్యం మద్దతులో దగా

'ధాన్యం క్వింటాకు రూ. 2,750 ఇవ్వాల్సిన ప్రభుత్వం కేవలం రూ.1,650-1,750 ఇచ్చేందుకు రాజకీయ నేతలు, అధికారులు కుమ్మక్కయ్యారు. బోనస్ పేరు చెప్పి మోసగించారు.. ఇది రైతులకు చేసిన ద్రోహం' అని పల్లా మండిపడ్డారు. ధర్మసాగర్ పంపుల వద్ద సిబ్బంది 34 రోజులు సమ్మె చేయడంతో జనగామ, పెద్దరాంచర్ల, వడ్లకొండ తదితర ప్రాంతాల్లో పంటలు ఎండిపోయాయని, దీంతో రైతులకు రూ. 600 కోట్ల నష్టం మిగిలిందన్నారు. 16 నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం తాగు, సాగు నీటి సమస్యలను పరిష్కరించలేకపోయిందని, రైతులు నీళ్ల కోసం పోరాడుతుంటే అధికారపార్టీ నాయకులు స్పందించక పోవడం దారుణమన్నారు. కేసీఆర్ నేతృత్వంలో 5.14 లక్షల ఎకరాలకు సాగునీళ్లందించే దిశగా పెద్ద ఎత్తున నిధులు కేటాయించారని, టన్నెల్‌లు, పంపుల పనులు పూర్తయినా ప్రస్తుత ప్రభుత్వం వాటిని ప్రారంభించలేదన్నారు. అభివృద్ధి పనుల కోసం తాను పోరాడతానని, ధర్మసాగర్ నుంచి రిజర్వాయర్లకు అవసరమైన నీళ్లు చేరేలా కృషిచేస్తానని పల్లా హామీ ఇచ్చారు.

నీలా గుంట నక్కను కాదు

– కడియం శ్రీహరిపై ఎమ్మెల్యే పల్లా ఫైర్

'కడియం శ్రీహరి.. నీలాగా నేను గుంట నక్కను కాదు.. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ప్రజల కోసం కాపలా కుక్కలా ఉంటా' అని పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఇటీవలె తనను బొచ్చు కుక్క అని విమర్శించిన కడియం శ్రీహరిపై ఆయన ఘాటుగా స్పందించారు. 'అవును నేను కుక్కనే.. నా ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే వారిని కాపాడేందుకు కాపలా కుక్కగా ఉంటా.. బీఆర్ఎస్ పార్టీకి, కేసీఆర్‌కు విశ్వాసం కలిగిన కుక్కలా పనిచేస్తా.. నీ నుంచి అటవీ భూములు కాపాడేందుకు రేసు కుక్కను అవుతా' అంటూ స్పష్టం చేశారు. అధికారవాంఛ, ధనదాహం కోసం ఊసరవెల్లులే సిగ్గుపడేలా పార్టీలు మార్చే నువ్వా నన్ను విమర్శించేది అంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కేసీఆర్‌కు, బీఆర్ఎస్‌కు విశ్వాసంగా ఉండే కుక్కనన్నారు. ఎవరేం చేస్తున్నారో ప్రజలకు తెలుసని, వారికి అండగా తానుంటానని, నిన్ను ఎదుర్కొనే దమ్ము, ధైర్యం నాకుంది అంటూ కడియంకు వార్నింగ్ ఇచ్చారు. బీఆర్ఎస్ హయాంలోనే ఘన్‌పూర్‌కు మంజూరైన మున్సిపాలిటీ, డిగ్రీ కాలేజీ, లిఫ్ట్ ఇరిగేషన్, 100 పడకల ఆస్పత్రి, నవాబ్‌పేట లైనింగ్ పనులను పార్టీలో ఉంటూనే అడ్డుకున్న చరిత్ర కడియం శ్రీహరిదని, అభివృద్ధి చేసే ఘనత బీఆర్ఎస్‌ది అని ఎమ్మెల్యే పల్లా అన్నారు.

మామిడి తోటకు నిప్పు

- కాలిపోయిన రెండు వేల చెట్లు
- సుమారు రూ.30 లక్షల నష్టం

కాలిపోయిన మామిడితోట

వెంకటాపూర్, ఏప్రిల్ 7: మండలంలోని రామకృష్ణాపూర్ పరిధి మామిడి తోటకు సోమవారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. ఘటనలో సుమారు 2వేలకు పైగా మామిడి చెట్లు కాలిపోయాయని రైతు తిరుపతిరావు తెలిపారు. సుమారు రూ.30 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు చెప్పారు. కొంతమంది వ్యక్తులు మామిడితోట వైపు వచ్చి వెళ్లారని, తర్వాత మంటలు ఒక వైపున కనిపించడంతో గ్రామస్తులను పిలుచుకొని వచ్చి ఆర్పేప్రయత్నం చేయగా అప్పటికే మంటలు పూర్తిగా వ్యాపించి తోట పూర్తిగా కాలిపోయిందన్నారు. రెండు వేలకు పైగా చెట్లతో పాటు డ్రిప్ పైపులు కాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశాడు. చేతికి వచ్చిన పంట అగ్నికి ఆహుతి అవడంతో రైతు విలపిస్తున్నాడు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు రైతు తెలిపారు. బాధిత రైతును ఆదుకోవాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

బొగ్గు మింగి బాలుడి మృతి

అయాన్ (ఫైల్)

గీసుగొండ, ఏప్రిల్ 7: వంటకు ఉపయోగించే బొగ్గు మింగి ఓ బాలుడు మృతిచెందాడు ఈ ఘటన గీసుగొండ మండలం విశ్వనాథపురంలో సోమవారం జరిగింది. సీఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. కొర్ర రాజు-శ్రీలత దంపతులకు ఇద్దరు ఆడపిల్లల తర్వాత కొడుకు అయాన్(9 నెలలు) జన్మించాడు. రాజు కొమ్మాల స్టేజీ వద్ద బిర్యానీ సెంటర్ నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 5న తల్లి శ్రీలత కొడుకును తీసుకొని బిర్యానీ సెంటర్‌కు వెళ్లింది. దంపతులు వంట చేస్తుండగా బాలుడు ఆడుకుంటూ వెళ్లి పొయ్యి వద్ద ఉన్న బొగ్గును మింగాడు. తల్లిదండ్రులు నర్సంపేట ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా ఎక్స్‌రే తీసి ఊపిరితిత్తుల్లో బొగ్గు ఇరుక్కుందని ఆపరేషన్ చేయాలని వైద్యులు చెప్పారు. వెంటనే హైదరాబాద్ నిలోఫర్‌కు తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం చనిపోయాడు.

గోల్డెన్ గార్డెన్

హనుమకొండ కలెక్టరేట్‌లోని పార్కుకు అవార్డు

ట్రోఫీ, సర్టిఫికెట్‌తో కలెక్టర్ ప్రావీణ్య, అధికారులు

హనుమకొండ, ఏప్రిల్ 7: హనుమకొండ కలెక్టరేట్ ఆవరణలో పార్కుకు రాష్ట్ర స్థాయిలో గోల్డెన్ గార్డెన్ అవార్డు దక్కింది. రాష్ట్ర ఉద్యానశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 8వ గార్డెన్ ఫెస్టివల్‌లో భాగంగా ఎంపికైన సందర్భంగా ప్రదానం చేసిన గోల్డెన్ ట్రోఫీ, సర్టిఫికెట్‌ను కలెక్టర్ ప్రావీణ్య సోమవారం కలెక్టరేట్‌లో ప్రదర్శించారు. లాన్ ఏరియా సహా సుమారు 114 రకాల పూలు, నీడనిచ్చే మొక్కలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్ది అవార్డుకు ఎంపికలో భాగస్వాములైన అధికారులను కలెక్టర్ అభినందించారు. అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్వో గణేశ్ పాల్గొన్నారు.


సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ధర్మారెడ్డి

రజతోత్సవాన్ని విజయవంతం చేయాలి

- పార్టీ కోసం పని చేసే కార్యకర్తలకు అండగా ఉంటా
- సన్నాహక సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

పరకాల, ఏప్రిల్ 7: హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పరకాల పట్టణంలోని మయూరి గార్డెన్స్‌లో పార్టీ ముఖ్య నాయకులతో ఆయన సన్నాహక సమావేశం నిర్వహించి మాట్లాడారు. రజతోత్సవ సభను కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహిస్తామన్నారు. సభ తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పతనం ప్రారంభమవుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన హామీలన్నీ బోగస్ అని తేలిపోయిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు భయపడే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడంలేదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ శ్రేణులు కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. రజతోత్సవ సభకు నియోజకవర్గం నుంచి 25 వేల మంది తరలిరానున్నట్లు తెలిపారు. పరకాలలో వార్డుల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహించాలన్నారు. రానున్న రోజులు బీఆర్ఎస్‌వేనని, పార్టీ నాయకులు, కార్యకర్తలు కొంత కాలం ఓపికగా ఉండాలని, ఎవరికీ భయపడొద్దని, పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. సమావేశంలో నాయకులు రేగూరి విజయపాల్‌రెడ్డి, బండి సారంగపాణి, నిప్పాని సత్యనారాయణ, గురిజపల్లి ప్రకాష్‌రావు, నేతాని శ్రీనివాస్‌రెడ్డి, భీముడి నాగిరెడ్డి, చింతిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, శనిగరం నవీన్, దామెర మొగిలి, గందె వెంకటేశ్వర్లు, చందుపట్ల తిరుపతిరెడ్డి, అడప రాము, గొర్రె రాజు, జలాలుద్దీన్, నక్క చిరంజీవి, వేణుగోపాల్, పంచగిరి శ్రీనివాస్, దుంపేటి నాగరాజు, గంట కళావతి పాల్గొన్నారు.

లక్షలాదిగా తరలిపోదాం..

- బీఆర్ఎస్ రజతోత్సవ సభను సక్సెస్ చేద్దాం
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పర్వతగిరి, ఏప్రిల్ 7 : ఈ నెల 27న బీఆర్ఎస్ రజతోత్సవ సభను సక్సెస్ చేసేందుకు లక్షలాదిగా తరలి వెళదామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం పర్వతగిరి మండలకేంద్రంలోని ఆయన నివాసంలో రజతోత్సవ సభకు జన సమీకరణపై ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ సభను విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదన్నారు. కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని, వారందరికీ బీఆర్ఎస్ పార్టీ అండగా ఉందన్నారు. తండాలను గ్రామ పంచాయతీలు చేసిన మహోన్నతమైన వ్యక్తి కేసీఆర్ అని పేర్కొన్నారు. కేసీఆర్ సార్ ముందుచూపుతో గిరిజన తండాలను గ్రామ పంచాయతీలు చేస్తే, ఈ ప్రభుత్వం కనీసం ఆ గ్రామ పంచాయతీలకు బిల్లులు చెల్లించేందుకు కూడా ముందుకు రావడం లేదన్నారు. రేవంత్‌రెడ్డి ఇచ్చిన అబద్ధపు హామీలను నమ్మి మోసపోయి కాంగ్రెస్‌కు ఓటేశామని ప్రజలు బాధపడుతున్నారని వారిని చైతన్యవంతం చేయాలన్నారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అడ్డగోలు హామీలిచ్చి ఇప్పటికీ అమలు చేయని విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. అలాగే కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వారికి మనం అండగా నిలిచి కాపాడుకోవాల్సిన అవసరం ఉన్నదన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తాచాటాలని వచ్చేది మన ప్రభుత్వమే కేసీఆర్‌ని ముఖ్యమంత్రి చేసే దిశగా అందరం కష్టపడాలన్నారు. పార్టీ బలోపేతం కోసం పాటుపడే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. రజతోత్సవ మహాసభను సమష్టిగా విజయవంతం చేయాలని వారికి దిశానిర్దేశం చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వరరావు, పర్వతగిరి పిఎసిఎస్ చైర్మన్ మోటపోతుల మనోజ్ కుమార్ గౌడ్, మాజీ జడ్పీటీసీ లూనావత్ పంతులు, కార్పొరేటర్ చింతల యాదగిరి, తాజా మాజీ సర్పంచులు మాలతీ సోమేశ్వర్ రావు, అమ్మడగాని రాజు, చిన్నపాక శ్రీనివాస్, ఏర్పుల శ్రీనివాస్, భానోత్ వెంకన్న నాయక్, ఈర్య నాయక్, వీరన్న, దేవేందర్, ఎంపీటీసీ సభ్యులు మాడుగుల రాజు, మోహన్ రావు, కాట్రోజు మౌనిక రాజు, సుభాషిని వాసు, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షులు బుర శ్యామ్ గౌడ్, సోషల్ మీడియా నాయకులు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ సంపదను కాపాడడమే లక్ష్యం

- రైతులకు నేను వ్యతిరేకం కాదు
- మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

ధర్మసాగర్, ఏప్రిల్ 7 : హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ముప్పారం, దేవునూర్ గ్రామాల పరిధిలోని ఇనుపరాతి గుట్టలకు సంబంధించిన రైతుల భూములకు తాను వ్యతిరేకం కాదని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హనుమకొండ జిల్లాలో ఉన్న ఏకైక అటవీ సంపదను కాపాడడమే తన లక్ష్యమన్నారు. రెవెన్యూ అధికారులు రైతులకు సంబంధించిన భూములను అటవీ సరిహద్దుకు బయట చూపించాలని, కానీ ఇష్టానుసారంగా అడవి మధ్యలో ఫారెస్టు డిపార్టుమెంట్ వారు ఏర్పాటు చేసిన కందకం బయట మాత్రమే భూములు చూపించాలని సూచించారు. అటవీ శాఖ అధికారుల సర్వే పూర్తయిందని, కానీ ఫైనల్ రిపోర్ట్ రాలేదని చెప్పినట్లు గుర్తు చేశారు. ఎవరైనా సరే ఫారెస్టు అధికారులు ఏర్పాటు చేసిన ట్రెంచ్ (కందకం) దాటి లోపలికి వచ్చి భూములు చదును చేయడమేంటనే విషయాన్ని పరిశీలించడానికి వచ్చామని తెలిపారు. కలెక్టర్ ప్రమేయం కూడా ఉందనే విషయం తెలుస్తున్నదని, ఇప్పటికైనా సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపి అటు రైతులకు న్యాయం చేస్తూ, ఇటు అటవీ సంపదను కాపాడాలని కోరుతున్నామని రాజయ్య పేర్కొన్నారు.